నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్బీటీ నగర్, చిరాన్ ప్యాలెస్, మారుతినగర్ ఫీడర్ల పరిధిలోని లాపలమ్మ అపార్టుమెంట్, మేయర్ విజయలక్ష్మి ఇల్లు, మిథిలానగర్, ఎస్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12, ఎస్‌కే నగర్, టెన్నిస్ కోర్ట్, ప్రగతి నగర్, మారుతీనగర్, యూసుఫ్‌గూడ బస్తీ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కనకదుర్గ టెంపుల్, గురుద్వారా ఫీడర్ల పరిధిలోని ఆనంద్ బంజారా కాలనీ, దుర్గా ఎన్‌క్లేవ్, యాదగిరినగర్, రహమత్‌నగర్ గురుద్వారా ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎల్లమ్మ టెంపుల్, జనప్రియ ఫీడర్ల పరిధిలోని బల్కంపేట, రేణుక ఎల్లమ్మ టెంపుల్, రేణుక నగర్, జనప్రియ అపార్టుమెంట్ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు డీకే రోడ్, న్యూశాస్త్రీ నగర్ ఫీడర్ల పరిధిలోని డీకే రోడ్, మాజీ సీఎం రోశయ్య ఇంటి లైన్, శివబాగ్, అవంతినగర్, పీఆర్ నగర్, న్యూశాస్త్రీ నగర్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న విదాయత్ అలీ మిర్జా

'షియాలకు పదవులివ్వాలి'

ఖైరతాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): షియాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తూ నామినేటెడ్ పదవులు ఇవ్వాలని షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ జాతీయ అధ్యక్షుడు విదాయత్ అలీ మిర్జా డిమాండ్ చేశారు. మంగళవారం లక్డీకాపూల్‌లో జాతీయ ఉపాధ్యక్షుడు సయ్యద్ అబీదుద్దీన్ అబ్బాస్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీ హైదర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. షియా ముస్లింలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని, అవకాశం ఉన్న ప్రతి చోటా తమకు సరైన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.


వంశీమోహన్ రెడ్డిని సన్మానిస్తున్న ఈఓ కృష్ణ

ఎల్లమ్మతల్లి ఆలయానికి ఆకాశదీపం బహూకరణ

అమీర్‌పేట, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా డీజీపీ కార్యాలయంలో పీసీఎస్ అండ్ ఎస్ వింగ్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న వంశీమోహన్ రెడ్డి బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి మంగళవారం ఆకాశదీపం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ కృష్ణ ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన వంశీమోహన్ రెడ్డికి అర్చకులు ఆశీర్వచనాలు అందించారు.

స్పాలో క్రాస్ మసాజ్

బంజారాహిల్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): క్రాస్ మసాజ్ చేస్తున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని మౌంటెన్ బ్యూటీ స్పాలో క్రాస్ మసాజ్ నడుస్తుందని బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం అందడంతో ఈ నెల 11న దాడులు నిర్వహించారు. క్రాస్ మసాజ్ జరుగుతుందని నిరారణ కావడంతో స్పా రిసెప్షనిస్ట్ పర్వీన్ బేగం, విటుడు దత్తా తన్నాజీ, ఐదుగురు యువతులను అదుపులోకి తీసుకోగా.. నిర్వాహకులు ప్రశాంత్, రవికుమార్ పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి 9 మొబైల్ ఫోన్‌లు, స్వైప్ మెషీన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖైరతాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సురేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ పోలీస్ ట్రాఫిక్ కంట్రోల్ రూం నుంచి అసెంబ్లీ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కంట్రోల్ రూం పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడికి 40 నుంచి 50 సంవత్సరాలు ఉంటాయని, 5.6 అడుగుల ఎత్తు ఉంటాడని, ఒంటిపై పసుపు రంగు చొక్కా, నీలి రంగు గళ్ల లుంగీ ధరించాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం

- ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్స్
- పైకప్పులు ధ్వంసం కావడంతో జారిపడుతున్న ప్రజలు
- ఫిర్యాదులకు స్పందించని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతంలోని మూడు రోడ్ల కూడలిలో ధ్వంసమైన మ్యాన్‌హోల్స్

బేగంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతంలో మ్యాన్‌హోల్స్ ధ్వంసమయ్యాయి. మరోవైపు వీధి లైట్లు వెలగకపోవడంతో రాత్రి వేళల్లో చీకటిగా ఉంటుంది. నిత్యం విద్యార్థులు ఆ దారిగుండా పాఠశాలలకు వెళ్తుంటారని.. చిన్నపిల్లలు ప్రమాదవశాత్తు నాలాల్లో పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పగిలిన పైపులు.. కుంగిన భూమి..

శ్యామ్‌లాల్ బిల్డింగ్ ప్రాంతంలో తాతాచారీ కాలనీ, ఎరుకుల బస్తీతో పాటు ఎగువ నుంచి వచ్చే వర్షం నీరు వెళ్లేందుకు నాగిళ్ల టవర్స్ రహదారి నుంచి గణపతి దేవాలయం చౌరస్తా వరకు వరద నీటి పైపులైన్ ఏర్పాటు చేశారు. ఈ పైపులైన్‌కు సమీప ఇళ్లలోని డ్రైనేజీ లైన్లు కలిపిన అధికారులు.. పలుచోట్ల మ్యాన్‌హోళ్లను ఏర్పాటు చేసి మూతలను అమర్చారు. అయితే బస్తీ దావాఖానా నుంచి శ్యామ్‌లాల్ ప్రధాన రహదారి వరకు ఈ లైన్‌లో పలు మ్యాన్‌హోల్స్ ధ్వంసమయ్యాయి. మూతలు పగిలిపోవడంతో పాటు కొన్నిచోట్ల సివరేజీ పైపులు పగలడం, భూమి కుంగడం వల్ల పెద్ద రంధ్రాలు ఏర్పడ్డాయి. వీటికి మరమ్మతులు చేయాలని పలుమార్లు జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లినా..

మూడు రోడ్ల కూడలిలో ఇవి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయని.. చిన్నపిల్లలు, మహిళలు ఇందులో పడి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. వీధి లైట్లు వెలగకపోవడం వల్ల రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల నాగిళ్ల టవర్స్‌కు చెందిన పలువురు సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులకు, ప్రకాశ్‌నగర్ వాటర్ వర్క్స్ సెక్షన్ మేనేజర్‌కు వినతిపత్రాలు అందజేయడంతో పాటు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే మరమ్మతులు చేయాలి



నోరుతెరుచుకుని ఉన్న మ్యాన్‌హోల్స్‌కు వెంటనే మరమ్మతులు చేయాలి. ద్విచక్రవాహనదారులు, విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల పలువురు చిన్నారులు కాలుజారి పడిపోవడంతో గాయపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేపట్టాలి.

\- శేషపాణి, శ్యామ్‌లాల్ బిల్డింగ్ నివాసి

పారదర్శకంగా రిజిస్ట్రేషన్లు

- ఒక్కో దరఖాస్తుకు గంట నుంచి 2 గంటల సమయం
- దక్షిణ మండలం జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 సయ్యద్ సిరాజ్ అన్వర్

ఇంటర్వ్యూ...



ఎర్రగడ్డ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు, భవనాలు, ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్లను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని దక్షిణ మండలం జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1 సయ్యద్ సిరాజ్ అన్వర్ పేర్కొన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎటువంటి రిజిస్ట్రేషన్లు చేస్తారు అనే విషయాలను 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.

మీ పరిధిలో ఎటువంటి రిజిస్ట్రేషన్లు జరుగుతాయి?

ఎర్రగడ్డ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వివాహ, స్థల, ఇళ్లు, భవనాలు, ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్లు చేస్తాం. హిందూ వివాహ చట్టం ప్రకారం కార్యాలయానికి వచ్చిన అవివాహితులకు పెళ్లిళ్లు జరిపి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇస్తాం.

మీ పరిధిలో స్థలాలు, పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్లు సుమారు ఎన్ని జరుగుతాయి?

సాధారణ వివాహాలు ప్రతి ఏడాది 900 నుంచి 1,100 వరకు నమోదవుతున్నాయి. స్పెషల్ మ్యారేజెస్ (ప్రేమ, విదేశీ వధూవరులు) ఏడాదికి 40 నుంచి 50 వరకు నమోదవుతున్నాయి. స్థలాలకు సంబంధించి ప్రతి సంవత్సరం 6,000 నుంచి 7,500 పైచిలుకు రిజిస్ట్రేషన్లు జరుగుతాయి.

ఒక్కో దరఖాస్తుకు ఎంత సమయం పడుతుంది?

కార్యాలయంలో ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ) పొందాలంటే గంట సమయం పడుతుంది. స్థలాల రిజిస్ట్రేషన్‌కు గంట నుంచి 2 గంటల సమయం పడుతుంది. సర్టిఫైడ్ కాపీకి 15 నిమిషాలు మాత్రమే పడుతోంది. స్టాంప్ పేపర్స్ కోసం 10 నిమిషాలు, ఫ్రాంకింగ్ కోసం 10 నిమిషాల వ్యవధి, వివాహ విషయంలో సాధారణ వివాహాలకు అరగంట సమయంలోనే వినియోగదారులకు ధృవీకరణ పత్రాలు లభ్యమవుతాయి. స్పెషల్ మ్యారేజెస్‌కు నెలరోజుల సమయం పడుతుంది. స్పెషల్ మ్యారేజెస్ చేసుకోవాలనుకునే వారు నెలరోజుల ముందుగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న వారు నెలరోజుల తరువాత వస్తే గంట వ్యవధిలోనే పెండ్లిపూర్తి చేసి సర్టిఫికెట్ అందజేస్తాం.

ఎర్రగడ్డ రిజిస్ట్రేషన్ కార్యాలయం పరిధిలోకి ఏఏ ప్రాంతాలు వస్తాయి?

షేక్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, వెంకటగిరి, కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, మోతీనగర్ ప్రాంతాలు వస్తాయి.

ఖాళీ స్థలాలు, ఇళ్లు, వివాహ రిజిస్ట్రేషన్లకు అవసరమై పత్రాలు ఏంటి?

వివాహానికి సంబంధించి పెండ్లి కుమార్తె, పెండ్లి కుమారుడికి సంబంధించి ఆహ్వానపత్రికలు, పెండ్లి ఫొటోలు, వయసు, నివాస ధృవీకరణ పత్రాలు, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు ఒరిజనల్, జిరాక్స్ కాపీలు తీసుకురావాలి. ఇళ్లు, ఖాళీస్థలాల రిజిస్ట్రేషన్‌కు భూమికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్స్, ఈసీ కాపీ, విక్రయదారుడు, కొనుగోలు దారుల ఫొటోలు, ఆధార్‌కార్డు పత్రాలను అందించాలి. రిజిస్ట్రేషన్ సమయంలో ఇద్దరు సాక్షులు సంతకాలు చేయాల్సి ఉంటుంది.

ప్రజావాణికి 748 దరఖాస్తులు


అర్జీ దారుల సమస్యలు తెలుసుకుంటున్న నోడల్ అధికారి దివ్య

బేగంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణికి 748 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మైనార్టీ వెల్ఫేర్ శాఖకు 420, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 110, విద్యుత్ శాఖకు 80, రెవెన్యూ 59, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్‌కు 14, ప్రవాసీ ప్రజావాణికి 2, ఇతర శాఖలకు 63 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజావాణి ఇన్‌చార్జ్ డా. చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి అర్జీలను తీసుకోవడంతో పాటు వారి సమస్యలను విన్నారు.

యూరప్‌లో ఉద్యోగం పేరుతో మోసం

యూరప్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.3.5 లక్షలు తీసుకున్న ఏజెంట్ ఆర్మేనియాకు తీసుకెళ్లి ఉద్యోగం ఇప్పించకుండానే తిరిగి పంపించాడని జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం అయితుపల్లికి చెందిన కూన రాములు ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఒక లైసెన్స్‌డ్ ఏజెన్సీ తనను మోసం చేసిందని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

గొలుసు మాయమైందని పోలీసులకు ఫిర్యాదు

బంజారాహిల్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆలయానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో మెడలో బంగారు గొలుసు మాయమైంది. అత్తాపూర్‌కు చెందిన నూక రవి కొత్త ద్విచక్రవాహనం కొనుగోలు చేసి గత నెల 14న తన తల్లితో కలిసి జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయానికి వాహన పూజ కోసం వెళ్లాడు. పూజ ముగించుకొని ఇంటికి వెళ్లి చూడగా రవి తల్లి మెడలో రూ.1.50 లక్షల విలువ చేసే గొలుసు కనిపించలేదు. అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా.. జూబ్లీహిల్స్‌లో ఫిర్యాదు చేయమని సూచించడంతో కొన్ని కారణాలతో వారు అప్పుడు ఫిర్యాదు చేయలేదు. అయితే ఈ నెల 11న రవి ఫిర్యాదు చేయడంతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పెళ్లి పేరుతో యువతిని మోసం చేసిన యువకుడు

బంజారాహిల్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని చెప్పి ఓ యువకుడు తనను మోసం చేశాడని యువతి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రముఖ కళాశాలలో చదువుతున్న యువతికి గత ఏప్రిల్ నెలలో సోషల్ మీడియా ద్వారా శ్రీధర్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి కూడా చేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో ఆమె గర్భం దాల్చడంతో అబార్షన్ చేయించాడు. ఇప్పుడు పెళ్లి చేసుకోవాలని అడిగితే నిరాకరిస్తున్నాడని.. అతడి కోసం తాను రూ.3 లక్షలు ఖర్చు చేశానని బాధితురాలు వెల్లడించింది. యువతి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు శ్రీధర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం

ఎర్రగడ్డ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మోతీనగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో గల శివాలయంలో మంగళవారం కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లంకల దీపక్ రెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. దేవాలయ కమిటీ అధ్యక్షుడు, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గూడూరి చెన్నారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు విజయలక్ష్మి, గూడూరి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి అఖిల భారత సహకార వారోత్సవాలు

పంజాగుట్ట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పరిధిలో ఒక ప్రాంతీయ సహకార యూనియన్, దానికి అనుబంధంగా ప్రాంతీయ సహకార శిక్షణ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని సహకార ధర్మ పీఠం సంస్థ వ్యవస్థాపక ధర్మకర్త ఎస్. భూమయ్య కోరారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14 నుంచి 20 వరకు 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు జరుగుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకార రంగంపై తీసుకొచ్చిన చట్టాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేసేలా ఉన్నాయని.. ఈ చట్టాలలో ఉన్న సెక్షన్లను వెంటనే ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

కలెక్టర్‌పై దాడిని ఖండిస్తూ నిరసన

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా కలెక్టర్‌పై జరిగిన దాడిని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఉద్యోగులు ఖండించారు. ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేస్తూ మంగళవారం ఉదయం కార్యాలయం ఎదుట ఉద్యోగులు, అధికారులు నిరసన చేపట్టారు. కలెక్టర్‌పై దాడి చేయడం అమానుషమని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీవాస్తవ అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ నేతలపై టీపీసీసీ లీగల్ సెల్ ఫిర్యాదు

బంజారాహిల్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ నేతలపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ ప్రకాష్ రెడ్డి మంగళవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ శ్రేణులు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డిపై ఇదే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్న చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆయన కోరారు.

పార్ట్‌టైం జాబ్ పేరుతో రూ.1.45 లక్షలు లూటీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ పేరుతో సైబర్ నేరగాళ్లు రూ.1.45 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి(25) ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ ప్రకటన చూసి వారిని సంప్రదించాడు. చిన్నపాటి టాస్క్‌లు చేస్తే డబ్బులు చెల్లిస్తామని చెప్పిన నేరగాళ్లు టెలిగ్రాం గ్రూపులో చేర్చారు. టాస్క్‌ల పేరుతో ఒక్కో సంస్థకు గూగుల్ రివ్యూలు ఇచ్చి, వాటిని స్క్రీన్‌షాట్ తీసి పంపమని కోరారు. నమ్మకం వచ్చేలా కొంత డబ్బు ఇచ్చిన కేటుగాళ్లు పెద్ద మొత్తంలో డబ్బు కావాలంటే ప్రతీ టాస్క్‌కు డబ్బు చెల్లించాలని సూచించారు. వారి మాటలను నమ్మిన బాధితుడు పలు దఫాలుగా రూ.1.45 లక్షలు ఇచ్చాడు. వీఐపీ గ్రూపులో చేరాలని చెప్పడంతో బాధితుడు నిరాకరించగా అతడి ఖాతాను బ్లాక్ చేశారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లక్ష్మి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అమీర్‌పేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ డివిజన్‌లోని శివాజీనగర్ శివాజీ విగ్రహం నుంచి ఎస్ఆర్‌టీ క్వార్టర్స్ వరకు రూ.12 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ కొలను లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ.. ప్రజలకు మౌలికవసతులు కల్పించేందుకు నిరంతరం పనిచేస్తున్నానన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బాల్‌రెడ్డి, ఏఈ భాస్కర్, నాయకులు బుచ్చిలింగం, ప్రకాష్ రెడ్డి, రాజు, మధు, వంశీకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, రాజేష్ ముదిరాజ్, పురుషోత్తం, రవి, సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇది సమగ్ర కుటుంబ సర్వే

- ఎమ్మెల్యే తలసాని విమర్శలకు కోట నీలిమ కౌంటర్


నీలిమ

అమీర్‌పేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేను తప్పుబడుతూ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ ఖండించారు. ప్రభుత్వం చేపడుతున్నది కేవలం కుల సర్వే మాత్రమే కాదని, ఇది సమగ్ర కుటుంబ సర్వే అని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ఉన్న నీలిమ మంగళవారం మాట్లాడి అమీర్‌పేటలోని పార్టీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. కుటుంబ సర్వేలో సామాజిక ఆర్థిక, విద్య వంటి అంశాలు తెలుసుకోకుండా ఎలా ఉంటారని ఆమె ప్రశ్నించారు. ఆధార్ కార్డు లేకుండా దేశంలో ఎలాంటి గుర్తింపు లేదన్నది శ్రీనివాస్ యాదవ్‌కు తెలియకపోవడం ఆశ్చర్యకరమని ఆమె పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వందల ఎకరాలు ఉన్న భూస్వాములకు సైతం రైతుబంధు ఇచ్చిందని.. తమ ప్రభుత్వం అలాంటి తప్పులను సరిదిద్దే ప్రయత్నం చేస్తుందన్నారు.

ఆలోచనలను స్పష్టంగా వ్యక్తీకరించాలి

- మంచి ప్లేస్‌మెంట్‌కు సరైన ప్రిపరేషన్ తప్పనిసరి
- జీఎన్ఐటీఎస్ ప్లేస్‌మెంట్ డీన్ ఐ.రవిప్రకాశ్ రెడ్డి


రవిప్రకాశ్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో మంచి కంపెనీల్లో ప్లేస్‌మెంట్ అవకాశాలు పొందాలంటే కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు సరైన ప్రిపరేషన్ తప్పనిసరని జి.నారాయణమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్(జీఎన్ఐటీఎస్) ప్లేస్‌మెంట్-డీన్ ఐ.రవిప్రకాశ్ రెడ్డి అన్నారు. ఉన్నతస్థాయి ప్రిపరేషన్ కోసం విద్యార్థులు నైపుణ్యాలు, ఆచరణాత్మక జ్ఞానాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులు స్పష్టంగా, కాన్ఫిడెంట్‌గా తమ ఆలోచనలను వ్యక్తీకరించగలగాలని సూచించారు. ఇంగ్లిష్ భాషపై పట్టుపెంచుకునేందుకు ఇంగ్లిష్ పత్రికలు చదవడం, న్యూస్ చూడటంతో పాటు స్పోకెన్ ఇంగ్లిష్ క్లాస్‌లకు హాజరవ్వడం మంచిదన్నారు. ఉద్యోగ ఇంటర్వ్యూల్లో గ్రూప్ డిస్కషన్స్ ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని, ఆ సమయంలో స్పష్టంగా మాట్లాడంతో పాటు ఇతరుల ఆలోచనలకు గౌరవం ఇవ్వడంలో ప్రతిభ కలిగి ఉండాలన్నారు. పలు అంశాలపై వ్యూహాలు, సూచనలు ఇవ్వగలగటం ముఖ్యమన్నారు. టెక్నికల్, మేనేజీరియల్ రోల్స్‌కు సంబంధించి చాలా కంపెనీలు ఆప్టిట్యూడ్ పరీక్షలను నిర్వహిస్తాయని.. వాటిలో ప్రావీణ్యం పొందడానికి రీజనింగ్, తక్కువ సమయంలో సమాధానాలు రాబట్టడం చాలా ముఖ్యమన్నారు. కోర్, ఎమర్జింగ్ టెక్నాలజీలలో సర్టిఫికేషన్లు, ముఖ్యంగా సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, మిషన్ లెర్నింగ్ వంటి వాటిలో పొందిన నైపుణ్యాలు విద్యార్థులకు మంచి మార్కెట్ విలువను కల్పిస్తాయన్నారు. విద్యార్థులు కనీసం రెండు, మూడు ప్రాజెక్టులు చేసి వారి జ్ఞానం, నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. ఈ ప్రాజెక్టులు పరిశోధనాత్మకంగా, ప్రాక్టికల్‌గా ఉండాలన్నారు. ప్రతివారం లీట్‌కోడ్, కోడ్‌చెఫ్ వంటి ప్లాట్‌ఫాంలలో జరిగే ప్రోగ్రామింగ్ కాంటెస్ట్‌లలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల సమస్యలు పరిష్కారం, కోడింగ్ స్పీడ్‌లో నైపుణ్యం సాధించవచ్చన్నారు.


నిరసనలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉద్యోగులు


అంబేడ్కర్ వర్సిటీ ఎందరికో దిక్సూచి

- పూర్వ విద్యార్థిని రుక్సానా

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గృహిణులు, మహిళలకు, పేద మధ్యతరగతి విద్యార్థులకు అంబేడ్కర్ వర్సిటీ దిక్సూచి లాంటిదని గోల్డ్ మెడలిస్ట్, డా.బి.ఆర్ అంబేడ్కర్ వర్సిటీ పూర్వ విద్యార్థిని రుక్సానా అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన పేద, దళిత, బడుగు బలహీన వర్గాలకు చెందిన ఎంతో మంది విద్యార్థులు వర్సిటీలో డిగ్రీలు సాధించారన్నారు. విశ్వవిద్యాలయంలో పది ఎకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ వర్సిటీ ఐక్యకార్యాచరణ సమితి సభ్యులు మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్‌పర్సన్ ప్రొ.పల్లవీ కాబ్డే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, జేఏసీ నేతలు ఎండీ హబీబుద్దీన్, డా.ప్రమీల కేతావత్, కాంతం ప్రేమ్ కుమార్, ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గంగపుత్రులను ఎంబీసీ జాబితాలో చేర్చాలి

- గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజేష్ ఖన్నా


బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజేష్ ఖన్నా

పంజాగుట్ట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గంగపుత్ర(బెస్త)లు సాంప్రదాయక మత్స్యకారులుగా ఉన్నారని, చేపల వేట ఆధారంగా జీవనం సాగిస్తున్నారని గంగపుత్ర సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజేష్ ఖన్నా గంగపుత్ర అన్నారు. ప్రభుత్వం స్పందించి గంగపుత్రులను ఎంబీసీ జాబితాలో చేర్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి గంగపుత్రులను ఎంబీసీ జాబితాలో చేర్చాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 2018లో 36 బీసీ కులాలను అత్యంత వెనుకబడిన(ఎంబీసీ) కులాల జాబితాలో చేర్చి, తమ సామాజిక వర్గాన్ని విస్మరించిందన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలలో సాంప్రదాయ మత్స్యకార గంగపుత్ర కులస్తులను ఎస్సీ, ఎస్టీలుగా గుర్తించారని, తెలంగాణలో బీసీ-ఏ సీరియల్ నంబర్ ఒకటిలో ఉన్న తమను ఎంబీసీ జాబితాలో చేర్చి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.





కొత్త సీఐ రఘుబాబుకు స్వాగతం పలుకుతేన్న ఎస్సైలు

లాలాగూడ ఇన్‌స్పెక్టర్‌గా రఘుబాబు

అడ్డగుట్ట,నవంబరు 12(ఆంధ్రజ్యోతి): లాలాగూడ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రఘుబాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేసిన కరుణాకర్ రెడ్డి సీసీఎస్ డీడీగా బదిలీపై వెళ్లారు. మల్టీజోన్- 2లో వెయిటింగ్‌లో ఉన్న రఘుబాబు లాలాగూడకు సీఐగా వచ్చారు. రాణా ఎస్సైలు, ఇతర సిబ్బంది కొత్త సీఐకి ఘనంగా సన్మానం చేసి ఆహ్వానించారు.

రైల్వే అధికారి ఆకస్మిక మృతి

చిలకలగూడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ సంచాలన్ భవన్‌లో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్ సీహెచ్ వీఎల్ఎన్ సుందర్(58) గుండె పోటుతో మంగళవారం మృతి చెందారు. కల్బలర్ కోటా లో విధుల్లో చేరి అంచెలంచలుగా పదోన్నతులు పొందారు. సోమవారం ఆఫీసుకు విచ్చిన ఆయన శశజవిధులు ముగించుకొని ఇంటికి వెళ్లాడని,గుండెలో నొప్పిగా ఉండటంతో రైల్వే ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు తోటి ఉద్యోగులు తెలిపారు. సుందర్ మంచి రంగస్థల నటుడని, రైల్వేలో నిర్వహించే పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడని తోటి ఉద్యోగులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూమార్తెలు ఉన్నారు. సుందర్ మృతదేహానికి మంగళవారం కేశవనగర్ కాలనీలోని నివాసం పలువురు నివాళులర్పించారు.

ఇది సమగ్ర కుటుంబ సర్వే

- ఎమ్మెల్యే తలసాని విమర్శలకు కోట నీలిమ కౌంటర్

అమీర్‌పేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కులగణన సర్వేను తప్పుబడుతూ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ ఖండించారు. ప్రభుత్వం చేపడుతున్నది కేవలం కుల సర్వే మాత్రమే కాదని, ఇది సమగ్ర కుటుంబ సర్వే అని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ఉన్న నీలిమ మంగళవారం మాట్లాడి అమీర్‌పేటలోని పార్టీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. కుటుంబ సర్వేలో సామాజిక ఆర్థిక, విద్య వంటి అంశాలు తెలుసుకోకుండా ఎలా ఉంటారని ఆమె ప్రశ్నించారు. ఆధార్ కార్డు లేకుండా దేశంలో ఎలాంటి గుర్తింపు లేదన్నది శ్రీనివాస్‌యాదవ్‌కు తెలియకపోవడం ఆశ్చర్యకరమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వందల ఎకరాలున్న భూస్వాములకు సైతం రైతు బంధు ఇచ్చిందని..తమ ప్రభుత్వం అ లాంటి తప్పులను సరిదిద్దే ప్రయత్నం చేస్తుందన్నారు.

లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఖైరతాబాద్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సురేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ పోలీస్ ట్రాఫిక్ కంట్రోల్ రూం నుంచి అసెంబ్లీ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొంది. అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. కంట్రోల్ రూం పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడికి 40 నుంచి 50 ఏళ్లు ఉంటాయని, 5.6 అడుగుల ఎత్తు ఉంటాడని, ఒంటిపై పసుపు రంగు చొక్కా, నీలి రంగు గళ్ల లుంగీ ధరించాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పెళ్లి పేరుతో యువతిని మోసం చేసిన యువకుడు

బంజారాహిల్స్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని చెప్పి ఓ యువకుడు తనను మోసం చేశాడని యువతి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రముఖ కళాశాలలో చదువుతున్న యువతికి గత ఏప్రిల్‌లో సోషల్ మీడియా ద్వారా శ్రీధర్ అనే యువకుడు పరిచయమయ్యాడు. తనను ప్రేమిస్తున్నానని, పెళ్లిచేసుకుంటానని నమ్మించాడు. ఈ క్రమంలో ఆమె గర్భం దాల్చడంతో అబార్షన్ చేయించాడు. ఇప్పుడు పెళ్లి చేసుకోవాలని అడిగితే నిరాకరిస్తున్నాడని.. అతడి కోసం తాను రూ.3 లక్షలు ఖర్చు చేశానని బాధిరాలు తెలిపింది. యువతి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు శ్రీధర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్ట్‌టైం జాబ్ పేరుతో రూ.1.45 లక్షలు లూటీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ పేరుతో సైబర్ నేరగాళ్లు రూ.1.45 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి(25) ఆన్‌లైన్ పార్ట్‌టైం జాబ్ ప్రకటన చూసి వారిని సంప్రదించాడు. చిన్నపాటి టాస్కులు చేస్తే డబ్బులు చెల్లిస్తామని చెప్పిన నేరగాళ్లు టెలిగ్రాం గ్రూపులో చేర్చారు. టాస్కుల పేరుతో ఒక్కో సంస్థకు గూగుల్ రివ్యూలు ఇచ్చి, వాటిని స్ర్కీన్‌షాట్ తీసి పంపమని కోరారు. నమ్మకం వచ్చేలా కొంత డబ్బు ఇచ్చిన కేటుగాళ్లు పెద్ద మొత్తంలో డబ్బు కావాలంటే ప్రతీ టాస్కుకు డబ్బు చెల్లించాలని సూచించారు. వారి మాటలను నమ్మిన బాధితుడు పలు దఫాలుగా రూ.1.45 లక్షలు ఇచ్చాడు. వీఐపీ గ్రూపులో చేరాలని చెప్పడంతో బాధితుడు నిరాకరించగా అతడి ఖాతాను బ్లాక్ చేశారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

పాఠశాల చెంత.. మురుగు చింత!

- అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాల ఎదురుగా పగిలిన డ్రైనేజీ పైప్‌లైన్
- దుర్వాసనతో ఏడాది కాలంగా విద్యార్థులు, స్థానికులకు అవస్థలు
- పట్టించుకోని జలమండలి అధికారులు

అడ్డగుట్ట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాల గేటు ఎదురుగా డ్రైనేజీ పైప్‌లైన్ పగిలిపోయి మురుగు నీరు రోడ్డుపై ఏరులై పారుతోంది. దీంతో పాఠశాల విద్యార్థులతో పాటు బస్తీవాసులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల ఎదురుగా ఉన్న మూడు డ్రైనేజీ పైపులు ఏడాది క్రితమే పగిలిపోయాయని, జలమండలి అధికారులతో పాటు స్థానిక కార్పొరేటర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం 5 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం ఐదు నుంచి రాత్రి 11 గంటల వరకు మురుగునీరు రోడ్డుపై పారుతోందని స్థానికులు చెప్తున్నారు. రోడ్డు మురుగు కూపంగా మారి దుర్వాస వస్తుండటంతో విద్యార్థులతో పాటు బస్తీవాసులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు పగిలిన మూడు డ్రైనేజీ పైప్‌లైన్ల స్థానంలో కొత్తవి వేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాల ఎదురుగా పగిలిన డ్రైనేజీ పైప్‌లైన్ ఇదే..

విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు



అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాల ఎదురుగా చాలా రోజుల నుంచి డ్రైనేజీ సమస్య ఉంది. మురుగునీరు రోడ్డు పారుతుండటంతో విద్యార్థులు, స్థానికులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. మురుగునీటిలో నడుచుకుంటూ వెళ్తుండటంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జలమండలి ఉన్నతాధికారులు పగిలిన డ్రైనేజీ పైప్‌ల స్థానంలో కొత్తవి వేసి సమస్యను పరిష్కరించాలి. - చందర్, టీడీపీ నేత

సమస్యను వెంటనే పరిష్కరించాలి



అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాల ఎదురుగా డ్రైనేజీ పైప్‌లైన్ పగిలిపోయి ఏడాది కావస్తోంది. ఈ ప్రాంతంలో మారేడుపల్లి ఎమ్మార్వో కార్యాలయం, అడ్డగుట్ట ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, పక్కనే అడ్డగుట్ట ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం ఉన్నాయి. డ్రైనేజీ దుర్వాసన కారణంగా ప్రజలు ఈ రోడ్డు వైపు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

- గెల్లు ఉదయ్ యాదవ్, బీజేవైఎం నేత



ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమావేశమైన డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి

త్వరగా పనులు పూర్తి చేయాలి

- డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి

తార్నాక, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్ రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె తార్నాకలోని తన క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు బీటీ రోడ్డు, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు త్వరితగతిన అను మతులు తీసుకుని ప్రారంభించాలని అధికారులకు సూచించారు. అదే విధంగా అన్ని డివిజన్ల పరిధిలో జీహెచ్ఎంసీ అధికారులు స్థానిక కార్పొరేటర్లకు తమ సహకారాన్ని అందిస్తూ అభివృద్ధి భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సికిం ద్రాబాద్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరాజు, డీఈ సువర్ణ, ఏఈ వేణు, కౌశిక్, లావణ్య, ఆశిష్ తివారి, శివకుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

తిరుమలగిరి నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవాల్లో భాగంగాకేంద్రీయ విద్యాలయ సంఘటన్ తిరుమలగిరిలోని కేంద్రీయ విద్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రాష్ట్రీయ ఏక్తా పర్వ్ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు మంగళవారం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. డ్రాయింగ్, నృత్యం, దేశభక్తి గీతాల అంశాల్లో విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ మంత్రముగ్ధుల్ని చేశాయి. దేశంలోని 25 రాష్ట్రాలకు చెందిన కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





తిరుమలగిరిలోని కేంద్రీయ విద్యాలయంలో సాంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

బోయిన్‌పల్లి, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ చదువుతున్న ఓ అమ్మాయి ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన ఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఢిల్లీలో నివాసం ఉంటున్న షేక్ నజియా మహబూబ్ పాషా తమ కూతురు షేక్ సమీరా (17)ను విజయవాడలోని ఓ కాలేజీలో చదివిస్తున్నారు. గత కొంతకాలంగా సమీరా ఓ అబ్బాయితో ప్రేమలో పడి అతడితో తిరుగుతోందని కాలేజీవారు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ఉండే మేనమామ ఇమ్రాన్ హుస్సేన్‌కు విషయం చెప్పి సమీరాను ఢిల్లీకి పంపించమని తెలిపారు. దీంతో రెండు రోజుల క్రితం విజయవాడ నుంచి షేక్ సమీరాను ఇమ్రాన్ హుస్సేన్ బోయిన్‌పల్లి బాపూజీ నగర్‌లోని తన నివాసానికి తీసుకువచ్చాడు. మంగళ వారం సాయంత్రం ఢిల్లీకి పంపించడానికి విమాన టికెట్‌ను బుక్ చేశాడు. మధ్యాహ్నం ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు తయారు కావాలని సమీరాకు చెప్పి మేనమామ బయటకు వెళ్లాడు. కొద్ది సేపటి తర్వాత అతడు తిరిగి వచ్చి చూడగా ఇంట్లో మేనకోడలు కనిపించలేదు. సమీరా ఫోన్‌కు చేస్తే పని చేయడంలేదు. దీంతో సాయంత్రం వరకు వేచిచూసిన ఇమ్రాన్ హుస్సేన్ విషయాన్ని ఢిల్లీలో ఉన్న సమీరా తల్లిదండ్రులకు చెప్పి బోయిన్‌పల్లి పోలీసుల టకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్‌లో వృద్ధుడి మృతదేహం లభ్యం



వృద్ధుడి మృతదేహం

అడ్డగుట్ట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో చనిపోయి ఉన్న ఓ వృద్ధుడి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసుకొని మార్చురీకి తరలించారు. గోపాలపురం పోలీస్ స్టేషన్ ఎస్సై మాధవి కథనం ప్రకారం.. సికింద్రాబాద్ సప్తగిరి హోటల్ వద్ద పిల్లర్ నెంబరు బి950 వద్ద గుర్తుతెలియని 70 ఏళ్ల వృద్ధుడు చనిపోయి ఉన్నాడని సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా మృతుడి ఆచూకీ తెలిస్తే గోపాలపురం పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై మాధవి కోరారు.

చండీబి కోసం కొనసాగుతున్న గాలింపు

- ఫొటో విడుదల చేసిన పోలీసులు



సఖీ సెంటర్ నుంచి పారిపోయిన చండీబి

అడ్డగుట్ట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కౌన్సిలింగ్ కోసమని వచ్చి సఖీ సెంటర్ నుంచి పారిపోయిన యువతి చండీబి (19) కోసం గాలిస్తున్నా మని గోపాలపురం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 2024 ఆగస్టు 20న తెల్లవారుజామున ట్యాంక్ బండ్ వద్ద ఒంటరిగా తిరుగుతున్న చండీబిని గమనించిన లేక్ పోలీస్ స్టేషన్ మహిళా కానిస్టేబుల్ ఆమెను చేరదీసి సికింద్రాబాద్ వారాసిగూడలోని సఖీ సెంటర్‌కు కౌన్సిలింగ్ కోసం తీసుకొచ్చారు. మహిళా కానిస్టేబుల్ సఖీ సెంటర్ లోపలికి వెళ్లగా.. నిర్వాహకులతో మాట్లాడుతున్న చండీబి ఆకలి వేస్తోందని సఖీ సెంటర్ నుంచి పారిపోయి తిరిగి రాలేదు. ఆమె కోసం స్థానికంగా గాలించినా ఫలితం లేకపోవడంతో 21న సఖీ సెంటర్ నిర్వాహకులు గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు చండీబి అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశారు. దాదాపు మూడు నెలలు అవుతున్నా ఆమె ఆచూకీ దొరకలేదని, ఆమె కోసం గాలిస్తున్నామని ఎస్సై తెలిపారు. చండీబి ఆచూకీ ఎవరికైనా తెలిసే 8712661249 నెంబరుకు సమాచారం ఇవ్వాలని ఆమె ఫొటోను మీడియా సమాచారంలో విడుదల చేశారు.

మరో యువతి కోసమూ ...



అదృశ్యమైన రేష్మా

అడ్డగుట్ట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో అదృశ్యమైన మరో యువతి కోసమూ గోపాలపురం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. మంగళవారం గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సుబ్బారావు వీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ తాడ్‌బండ్ సిఖ్‌విలేజీలో ఉన్న సఖీ సెంటర్‌లో 16 ఏళ్ల రేష్మా మూడేళ్ల నుంచి ఉంటోంది. 2024 ఆగస్టు 20న రేష్మా సెంటర్ నుంచి తప్పించుకుని పారిపోయింది. వెంటనే సఖీ సెంటర్ నిర్వాహకులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులు ఆర్పీఎఫ్ పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు కింద నమోదు చేశారు. అప్పటి నుంచి రేష్మా కోసం గాలిస్తున్నామని ఫలితం లేకపోవడంతో రేష్మా ఫొటోను విడుదల చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఈమె ఆచూకీతెలిస్తే వెంటనే 8712660669 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎన్నికలా.. విలీనమా?

- కంటోన్మెంట్‌పై ఏదో ఒకటి తేల్చండి
- కేంద్ర రక్షణ శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యుడికి ఎమ్మెల్యే శ్రీగణేశ్ విజ్ఞప్తి

సికింద్రాబాద్, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని, లేదా కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని కేంద్ర రక్షణ శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యుడు ప్రసాద్ చౌహాన్‌కు సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేశ్ విజ్ఞప్తి చేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను సందర్శనకు వచ్చిన ప్రసాద్ చౌహాన్, కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్‌లతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారి దృష్టి కీలకమైన ఈ అంశాలను తీసుకొచ్చారు.

ఎన్నికలు జరగకపోవడంతో పాలన అస్తవ్యస్తం..

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి ఎన్నికలు చివరి సారిగా 2015లో జరిగాయని, ఐదేళ్ల అనంతరం 2020లో మళ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా ఇప్పటి వరకూ నిర్వహించలేదని ఎమ్మెల్యే శ్రీగణేశ్ తెలిపారు. పాలక మం డలి ఎన్నికలు జరపకపోవడంతో ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులు లేక కంటోన్మెంట్‌లో పాలన అస్తవ్యస్తంగా మారిందని, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని శ్రీగణేశ్ తెలిపారు.

రాజకీయ నాయకుడికి సివిలియన్ నామినేటెడ్ పదవి?


ఎన్నికలు నిర్వహించకుండా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు సివిలియన్‌ను నామినేటెడ్ సభ్యుడిగా నియమించారని, ప్రతి ఆరు నెలలకోసారి ఈ పదవిని పొడిగిస్తూ వస్తున్నారని శ్రీగణేశ్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు ప్రసాద్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యుడిగా ఉన్న వ్యక్తి ఓ రాజకీయ నాయకుడని, ఒకే వ్యక్తికి ఎన్నిసార్లు నామినేటెడ్ సభ్యుడి పదవి ఇస్తారని ప్రశ్నించారు.

రూ.900 కోట్ల సర్వీసు చార్జీల బకాయిలు ఇప్పించాలి

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని ఆర్మీ స్థలాలు, భవనాలు, కార్యాల యాలు, క్వార్టర్స్‌కు అందిస్తున్న సేవలకుగాను కంటోన్మెంట్ బోర్డుకు చెల్లించ వల్సిన సర్వీసు చార్జీలు క్రమం తప్పకుండా చెల్లించ డం లేదన్నారు. దీంతో రూ. 900 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, తక్షణమే ఈ బకాయిలను ఇప్పించాలని శ్రీగణేశ్ కోరారు. అలాగే కంటోన్మెంట్ పరిధిలో వాణిజ్యపరంగా ఉపయోగించే భవనాలపై పన్ను వసూలు చేయాలని, దాని ద్వారా బోర్డుకు ఆదా యం సమకూరుతుందని తెలిపారు.

రెసిడెన్షియల్ స్కూల్‌కు భూమి కేటాయించాలి..

రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సికింద్రా బాద్ కంటోన్మెంట్‌లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉందని, స్కూల్ భవనాన్ని నిర్మించేందుకు అనువైన భూమిని కేటాయించాలని శ్రీగణేశ్ కోరారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటైతే కంటోన్మెంట్‌లో విద్యా వ్యాప్తికి, మెరుగైన విద్య అందించడానికి దోహదపడుతుందన్నారు.



కేంద్ర రక్షణ శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యుడు ప్రసాద్ చౌహాన్‌తో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీగణేశ్

విలీనం చేస్తేనే అభివృద్ధి సాధ్యం

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చే యాలని, తద్వారా గ్రేటర్‌లోని అన్ని ప్రాంతాల మాదిరిగా కంటో న్మెంట్ అభివృద్ధి సాధ్యమవుతుందని కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవీందర్ కోరారు. శ్రీగణేశ్‌తోపాటు సమా వేశానికి హాజరైన సంకి రవీందర్ మాట్లాడుతూ, వెంటనే కంటో న్మెంట్‌ను విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఒకే వ్యక్తికి నామి నేటెడ్ పదవిని పొడిగించుకుంటూ వెళ్లడం పద్ధతిగా లేదని వ్యాఖ్యానించారు. జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే జీహెచ్ఎంసీ ఎన్నికలతోపాటు కంటో న్మెంట్‌లోని వార్డులకు కూడా ఎన్నికలు నిర్వహిస్తారని ఆయన అన్నారు.

- సంకి రవీందర్, కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి

పేదల ప్రయోజనం కోసమే సర్వే

- సికింద్రాబాద్ డీసీసీ చైర్మన్ గంట రాజుసాగర్

అడ్డగుట్ట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పేద బలహీన వర్గాల స్థితిగతులను అధ్యయనం చేసి వారికి సరైన రీతిలో సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని టీపీసీసీ కేకేసీ సికింద్రాబాద్ డీసీసీ చైర్మన్ గంట రాజుసాగర్ కోరారు. మంగళవారం అడ్డగుట్టలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కుల గణన చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సమగ్ర కుటుంబ సర్వేను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల అంశాలను ఈ సర్వే ద్వారా ప్రభుత్వం సేకరిస్తుందని, దీని వల్ల అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేసేందుకు, నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధి కల్పన చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజలకు ఎంతో మేలు చేసే సమగ్ర సర్వేపై లేనిపోని అపోహలు పెట్టుకోకుండా ఇంటికి వచ్చే సర్వే సిబ్బందికి పూర్తిగా సహకరించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శైలజ

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి

బౌద్ధనగర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్ రోడ్డు నెంబరు 3లో సీసీ రోడ్డు పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ కంది శైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పని సరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, జగదీష్, రాజేష్, జీహెచ్ఎంసి ఇంజనీరింగ్ సిబ్బంది డీఈ రఘు, ఏఈ కౌశిక్, లావణ్యపాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు కొత్త ప్రణాళికలు

- తిరుమలగిరి ఠాణా ఇన్‌స్పెక్టర్ మధుబాబు



తిరుమలగిరి నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు కొత్త ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని ఇన్‌స్పెక్టర్ మధు బాబు తెలిపారు. ఠాణా పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు తదితరాలపై ఇన్‌స్పెక్టర్ మధుబాబు 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ వివరాలు ఇవీ..

తిరుమలగిరి ఠాణా పరిధిలో ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టారు?

ప్రమాదాల నివారణకు ప్రత్యే చర్యలు తీసుకుంటున్నాం. ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్ పాటించేలా కౌన్సిలింగ్ నిర్వహించడంతో పాటు సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేస్తున్నాం

మైనర్లు వాహనాలను నడిపితే ఏం చేస్తారు?

మైనర్లకు వారి తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదు. ఒక వేళ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు మైనర్లను కోర్టులో హాజరుపరుస్తాం.

మద్యం మత్తులో వాహనం నడిపితే ఎలా?

వాహనదారులు మద్యం మత్తులో వాహనాలు నడపకూడదు. తాగి డ్రైవింగ్ చేస్తుండటం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటి నివారణ కోసమే వారంలో ఐదు రోజులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి మద్యం తాగి వాహనం నడుపుతున్న వారిని పట్టుకొని కోర్టు ద్వారా శిక్ష వేయిస్తున్నాం.

నగరంలోకి భారీ వాహనాలకు అనుమతి ఉందా?

రాత్రి పూట మాత్రమే భారీ వాహనాలకు నగరంలో ప్రవేశించడానికి అనుమతి ఉంది. పగలు ప్రవేశం నిషేధం. ఏదైనా భారీ వాహనం నిబంధనలకు విరుద్ధంగా నగరంలోకి ప్రవేశిస్తే డ్రైవర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నాం.

వేగ నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టారు?

ప్రమాదాలను నివారించడంలో భాగంగా రాత్రి సమయంలో వాహనాలు వేగంగా వెళ్లకుండా రోడ్లపై జిగ్‌జాగ్ బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నాం. దీని వల్ల కొంత మేర ప్రమాదాలను నివారించేందుకు అవకాశం ఉంది.

వాహనాల వేగాన్ని గుర్తించడానికి ఎలాంటి చర్యలు చేపట్టారు?

ఉదయం వేళ వేగంగా వాహనాలు వెళ్తుంటాయి. లేజర్ గన్ సహాయంతో వాహనాల స్పీడ్‌ను గుర్తిస్తున్నాం. అతి వేగంగా వెళ్లిన వాటిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నా.



చేనేత వస్త్ర ప్రదర్శనలోని వస్త్రాలను ఆసక్తిగా పరిశీలిస్తున్న వినియోగదారులు

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన

తార్నాక, నవంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలకు ఫ్యాషన్ వస్త్రాలను ఒకే వేదికపై అందించేందుకు కళా సిల్క్ సొసైటీ ఆధ్వర్యంలో తార్నాకలోని ఐఐసిటీ స్టాఫ్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటోంది. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పోచంపల్లి చీరలు, బెడ్ షీట్స్, వెస్ట్ బెంగాల్ జాంధాన్ని చీరలు, రాజస్థానీ కోటా చీరలు, మంగళగిరి, ఉప్పాడ, చీరాల, వెంకటగిరి, ధర్మవరం చీరలు, కలంకారి చేనేత డ్రెస్ మెటీరియల్, లక్నో చెకెన్ వర్క్ కుర్తిస్, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు, తిరోక్ వస్త్రాలు ఎగ్జిబిషన్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని ఎగ్జిబిషన్ నిర్వాహకుడు వికాస్ జైన్ మంగళవారం తెలిపారు. ఈ నెల 17వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని చేనేత హస్తకళలను మరింత ప్రోత్సహించాలని కోరారు.

14 నుంచి అఖిల భారత సహకార వారోత్సవాలు

పంజాగుట్ట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ పరిధిలో ఒక ప్రాంతీయ సహకార యూనియన్, దానికి అనుబంధంగా ప్రాంతీయ సహకార శిక్షణ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని సహకార ధర్మపీఠం సంస్థ వ్యవస్థాపక ధర్మకర్త ఎస్.భూమయ్య కోరారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14 నుంచి 20 వరకు 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు జరుగుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకార రంగంపై తీసుకొచ్చిన చట్టాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేసేలా ఉన్నాయని.. ఈ చట్టాలలో ఉన్న సెక్షన్లను వెంటనే ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు.